## క్లుప్తంగా

### శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



**ఉండవెల్లి:** మండలంలోని తక్కశిలలో త్రైత సిద్ధాంత ఆచార్య ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణుడికి భక్తులు ఐదు రోజులు పూజలు నిర్వహించి శుక్రవారం పల్లకీపై ఊరేగించారు. ముస్లిం వ్యక్తి పల్లకీని మోయడంతో 'అందరు ఒక్కటే' అంటూ ఊరేగింపులో భక్తులు పేర్కొన్నారు కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన



**ఉండవెల్లి:** మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా వరలక్ష్మి వ్రతం



**ఉండవెల్లి:** మండలంలోని ప్రాగటూరులో భక్తులు శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, ధనలక్ష్మి, శాఖాంబరి అలంకరణలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**ఉండవెల్లి:** మండలంలోని జాతీయ రహదారిపై ఈనెల 29న బైక్‌పై ఎర్రవల్లి నుంచి కర్నూల్ జిల్లా లొద్దిపల్లెకు వెళ్తున్న శ్రావణ్‌కుమార్ జాతీయ రహదారిపై ఉండవెల్లికి చెందిన ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ సిగ్నల్ వేయకుండా నిర్లక్ష్యంగా రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో శ్రావణ్‌కుమార్ తండ్రి నాగమద్దిలేటి ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్ డ్రైవర్ రాముడుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**చాగదోణ ఘటనపై..**

**గట్టు:** మండలంలోని చాగదోణకు చెందిన రైతు మునిస్వామి (34) విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటనలో శుక్రవారం కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. అతని భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం రైతు మునిస్వామి విద్యుదాఘాతానికి గురై, కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.

### జిల్లా ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

**గద్వాలన్యూటౌన్:** స్థానిక సంస్కార్ పాఠశాలలో శుక్రవారం జిల్లా ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా ఎమినానాయక్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా మాసుంబీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీటీయూ సభ్యులు పాల్గొన్నారు.

### ఫుడ్‌స్టేషన్‌ను సందర్శించిన చిన్నారులు

**ఎర్రవల్లి:** మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాల చిన్నారులు శుక్రవారం ఫుడ్‌స్టేషన్ ట్రిప్పులో భాగంగా జిల్లా కేంద్రంలోని మోర్ సూపర్ మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌లో నాణ్యమైన ఆహారం, జంక్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. వాటి వల్ల కలిగే ఉపయోగాలతో పాటు నష్టాలను పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామాంజనేయులు, క్యాంపస్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, చిన్నారులు ఉన్నారు.

### డీటీకి వినతి

**ఉండవెల్లి:** మండల కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జయరాజ్ వినతిపత్రం అందజేశారు. అలంపూర్ చౌరస్తాలో 253/సి, 273/అ1 లోని భూములను ప్రభుత్వ కార్యాలయాలకు, ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిలింగ్ భూములు చేతులు మారుతున్నాయని, కొందరు వ్యక్తులు కోట్లలో అమ్మకాలు చేశారని, ఆ భూములను కాపాడాలని డీటీకి తెలిపారు.

### మోస్తరు వర్షం

**ఉండవెల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం కురిసిన వర్షానికి రైతులు పొగాకు నారు పొలాల్లో సాగు చేస్తున్నారు. అధికంగా పొగాకు సాగు చేస్తున్నారు.

# సమయ పాలన పాటించాలి



అలంపూర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్‌కుమార్



నందిన్నె కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

- ఎఫ్‌ఎల్‌ఎన్‌కు అనుకూలంగా పాఠాలు బోధించాలి
- పటిష్టంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

**అలంపూర్ రూరల్:** ఎఫ్‌ఎల్‌ఎన్‌కు అనుకూలంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఎంఈఓ ఆర్ అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. 1వ తేదీ నుంచి స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం అమలు చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బాలాజీ కృష్ణ కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయ భాస్కర్ అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సురేష్ మాట్లాడారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పని కల్పించడం, వచ్చే నెలలో తరగతిలో బోధించాల్సిన ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు పాఠశాల ప్రార్థన సమయానికి అందరూ హాజరుకావాలని, సాయంత్రం పాఠశాల విడిచి వెళ్లేటప్పుడు 10 నిమిషాలు లేటు వెళ్లాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన టెస్టింగ్ రిజిస్టర్ మెంటెనెన్స్ చేయాలని, మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను డబ్బాలలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో టైంటేబుల్ అమలు చేయాలని సూచించారు.

**ధరూరు:** ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సమయ పాలన పాటించాలని కాంప్లెక్స్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడో శనివారం కచ్చితంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రవీంద్రబాబు, సీఆర్‌పీ నర్సింహులు పాల్గొన్నారు.



మానవపాడులో మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

**మానవపాడు:** గతంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు అరకొరగా ఉండేవని, ఇక నుంచి గుణాత్మక మార్పుల కోసం విద్యాశాఖ పలు సంస్కరణలు చేపడుతుందని, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఇక నుంచి పటిష్టంగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చాయని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. 50శాతం టీచర్లు సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## చేసిన పనులే గుర్తుండి పోతాయి



హుస్సేన్ దంపతులను సన్మానిస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ సిద్దప్ప, తదితరులు

**గట్టు:** ఎంతకాలం పని చేశామని కాకుండా ఏ మేరకు సేవలందిచామనేది ముఖ్యమని, ప్రతి ఉద్యోగి సర్వీసులో గుర్తుంచుకో తగ్గ పనులు చేసినప్పుడు ఆ ఉద్యోగికి తృప్తినిస్తుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ సిద్దప్ప తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న హుస్సేన్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌ఓ, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, మాజీ సర్పంచ్ ధనలక్ష్మి హుస్సేన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా హుస్సేన్ 11 ఏళ్లు గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, 33ఏళ్లు వైద్యశాఖలో పని చేసి, సేవలు అందిచారన్నారు. హుస్సేన్ మాట్లాడుతూ గట్టులో ఉద్యోగ నిర్వహణ సంతృప్తినిచ్చిందని, అందరి సహకారంతో ముందుకు సాగామని, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంగడి బస్వరాజు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజు, ఎంసీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసుందర్, గద్వాల తిమ్మప్ప, జిల్లా వైద్య సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి



చాగదోణలో ప్రారంభించిన కిరాణ దుకాణం

**గట్టు:** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని, బ్యాంకుల ద్వారా అందించే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సాంబశివుడు కోరారు. శుక్రవారం చాగదోణలో మహిళా శక్తి ప్రోగ్రామ్‌లో భాగంగా ఉరుకుందమ్మకు కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు యూనియన్ బ్యాంకు ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేసినట్లు ఏపీఎం తెలిపారు. బ్యాంకు ద్వారా పొందిన రుణంతో ఏర్పాటు చేసిన కిరాణ దుకాణాన్ని మహిళా సంఘం అధ్యక్షురాలు శంకరమ్మ, ఏపీఎం సాంబశివుడు ప్రారంభించారు. బ్యాంకు రుణాలను సకాలంలో వాయిదాలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ రామకృష్ణ, గ్రామ సంఘం మహిళలు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న మధులికరెడ్డి

**ఎర్రవల్లి:** ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో కరస్పాండెంట్ మధులికరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మీడియా రంగం, ఎన్నికల అంశంతో పాటు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, రాబోయే తరానికి వారసులన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పిస్తుందన్నారు. పాఠశాలలో నిర్వహించే ఎన్నికల్లో విద్యార్థులంతా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ఘనంగా వీహెచ్‌పీ స్థాపక దినోత్సవం



శ్రీరాముడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

**శాంతినగర్:** విశ్వహిందూ పరిషత్ స్థాపక దినోత్సవాన్ని శాంతినగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ మహాలక్ష్మి కాంప్లెక్స్ సమీపంలో గల రైస్‌మిల్ ఆవరణలో పట్టాభిరాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం కాషాయ జెండా ఎగురవేశారు. 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ సభ్యులు మాణిక్యం వెంకటేశ్వర్లు, గాయత్రి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, గొంగళ్ల వెంకట్రాముడు, రామచంద్రుడు, తిమ్మప్ప, వెంకటేష్, ఎల్లయ్య, వెంకటయ్య, తిప్పన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**అలంపూర్ రూరల్:** పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి ఆర్ అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థులకు సరిపడ భోజనం, రుచికరంగా వంటలు చేయాలని సూచించారు. అన్నం, సాంబర్ తదితర పదార్థాలను ఎంఈఓ టేస్ట్ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని ఆదేశించారు.

### సజావుగా కౌన్సిల్ సమావేశం

**అయిజ:** మున్సిపాలిటీలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం సజావుగా సాగింది. మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అధ్యక్షతన మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి సమావేశంలో 13 అంశాలు ప్రవేశపెట్టగా, వాటిలో 12 అంశాలను కౌన్సిలర్లు ఆమోదించారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

### ఎల్‌ఓసీ అందజేత



**ఉండవెల్లి:** వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన సుంకన్న అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆపరేషన్ ఖర్చులకు నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

### దోమల నివారణకు చర్యలు



**శాంతినగర్:** వర్షపునీరు, మురుగు నిలిచే చోట ఎర్రమట్టి వేసి దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు. వడ్డేపల్లిలోని ఆయా వార్డుల్లో గుంతలు, వర్షపు నీరు, మురుగు నిలిచే చోట ట్రాక్టర్లతో ఎర్రమట్టితో చదును చేయించారు. నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధృతి పెరుగుతోందని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

### దేశం, ధర్మం కోసం పనిచేసేది బీజేపీ

**అలంపూర్ రూరల్:** దేశం, ధర్మం కోసం పని చేసే ఏకైక పార్టీ బీజేపీ అని బీజేవైఎం రాష్ట్ర కాలేజ్ ఔట్‌రీచ్ కో ఆర్డినేటర్ తిరుమలేష్ యాదవ్ అన్నారు. పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగ మద్దిలేటి అధ్యక్షతన శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ మొదటి సభ్యత్వం తీసుకుంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 200 మందికి తగ్గకుండా సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగ మద్దిలేటి, బంగారు లక్ష్మణ్, వినీత్ కుమార్, శరత్‌బాబు, మద్దిలేటి, ప్రభాకర్, పరశురాం, కృష్ణ పాల్గొన్నారు.

### విద్యార్థినులను అభినందించిన టీచర్లు



**ధరూరు:** మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో రాణించిన కేజీబీవీ విద్యార్థినులను శుక్రవారం ఇన్‌చార్జి ఎస్‌ఓ పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో 13 మంది విద్యార్థినులు జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరి, నర్సమ్మ, రేణుక, కృష్ణప్రద, శ్రీలత, హేమలత, నాగమ్మ, పీఈటీ స్వప్న, తదితరులు ఉన్నారు.

### మౌలిక వసతులు కల్పించండి

**అయిజ:** ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంఈఓను అఖిలపక్ష నాయకులు కలిశారు. పట్టణంలోని దుర్గానగర్, భరత్‌నగర్ కాలనీల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదుల కొరత ఉందని, మరుగుదొడ్లు నిర్మించలేదని ఇన్‌చార్జి ఎంఈఓకు తెలిపారు.

### రిజర్వాయర్లను నింపండి

**అయిజ:** భారీ వర్షాలు కురిసి నదులకు వరద వచ్చినా రిజర్వాయర్‌లను నీటితో నింపడంలేదని జోగుళాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేష్ అన్నారు. శుక్రవారం ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌ను వారు పరిశీలించారు. జిల్లాలోని తాటికుంట, ముచ్చోనిపల్లి, నాగర్‌దొడ్డి, చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లను నీటితో నింపి ఆయకట్టు పొలాలకు సాగు నీరందించాలని కోరారు.

## అనుబంధ రంగాలపై దృష్టి సారించండి



అవగాహన కల్పిస్తున్న ఏపీడీ శ్రీనివాస్

**శాంతినగర్:** వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టిసారించి పంటలు దిగుబడి పొంది, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన ఉపాధి కూలీలకు వడ్డేపల్లి మహిళా సమాఖ్య భవనంలో ఉన్నతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు వ్యవసాయ ఆధారిత ఎరువులు, క్రిమ సంహారక మందు పిచికారీపై అందరు తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కృషి విజ్ఞానకేంద్రం సైంటిస్ట్ భవాని మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి పొలాల్లో సొంతంగా తయారు చేసిన వర్మీకాంపోస్టు వేసుకోవాలన్నారు. వర్మీకంపోస్టు తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉన్నతి సెక్టర్ అధికారి మహేష్, ఎంపీడీఓ రామకృష్ణ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి పనుల్లో వందరోజులు పూర్తిచేసిన 103 మంది కూలీలు హాజరయ్యారు.

## రైతులు సరైన ధ్రువపత్రాలు సమర్పించాలి



సమాచారం సేకరిస్తున్న ఏడీఏ సక్రియ నాయక్

**ఎర్రవల్లి:** రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులకు సరైన ధ్రువపత్రాలు అందించాలని ఏడీఏ సక్రియనాయక్ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఏఓ రవికుమార్ సేకరిస్తున్న వివరాలను ఏడీఏ పరిశీలించారు. రుణమాఫీ కానీ రైతులు రైతు సమాచార పత్రంతో పాటు రైతు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, రుణఖాతా పుస్తంతో పాటు రుణఖాతా యొక్క స్టేట్‌మెంట్‌ను జతచేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వేదావతి, రైతులు ఉన్నారు.

**అయిజ:** మండలంలోని యాపదిన్నె, తూంకుంట గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో రైతుల వివరాలు సేకరించారు. శనివారం మేడికొండ రైతు వేదికలో, పులికల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల వివరాలను సేకరించనున్నట్లు ఎంఏఓ తెలిపారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఆర్ఐ గురురాజ్

**మానవపాడు:** చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఆర్ఐ గురురాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని చండూరులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో కుల దూషణలపై విచారణ చేశారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీస్‌లు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**గట్టు:** గ్రామంలో పౌరులంతా కలిసి మెలిసి జీవించాలని, వివక్షత లేకుండా ఉండాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా ఆలూరులో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవి, ఆర్ఐ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**రాజోళి:** కుల మతాలు లేకుండా, అందరికి సమాన జీవన విధానాన్ని కలిగి ఉండడమే పౌర హక్కులని ఆర్ఐ చంద్రకాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసులు అన్నారు. తూర్పు గార్లపాడులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది గిరి, ఇంద్ర ఉన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ స్వాతి

**ఎర్రవల్లి:** మండలంలోని సాసనూలు గ్రామంలో కోదండాపురం పీఎస్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వాతి ప్రజలకు ఆపదలో ఉపయోగపడే డయల్-100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసనాలు, సీసీ కెమెరాల ఉపయోగం, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

### రైతులకు అన్నిరకాల సేవలందించాలి

**అయిజ:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలందించాలని డీసీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఆ యన పరిశీలించారు. సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పీఏసీఎస్ ద్వారా నిర్వహిస్తున్న క్రిమిసంహారక మందుల దుకాణం, సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పశుగణనకు రైతులు సహకరించండి

**శాంతినగర్:** పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఐదేళ్లకోసారి చేపట్టే పశుగణనకు మండలంలోని గ్రామాల రైతులు సహకరించి పూర్తి సమాచారం ఇవ్వాలని డాక్టర్ పుష్పలత కోరారు. వడ్డేపల్లి మండలంలోని గ్రామాల్లో పనిచేసే పశువైద్య సిబ్బంది సమావేశం శుక్రవారం శాంతినగర్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో నిర్వహించారు. పాడిపశువులు, కోళ్లు, పెంపుడు జంతువులు, సంచార పశువులు, వీధి కుక్కలను లెక్కించి యాప్‌లో నమోదుచేస్తామని, రైతులు సమాచారం ఇవ్వాలన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మానవపాడు:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి డ్రై డే ఫ్రైడే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ఆటల పోటీల్లో ప్రతిభ

**శాంతినగర్:** మండల స్థాయి ఆటల పోటీల్లో స్థానిక సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వడ్డేపల్లి ఎంఈఓ నరసింహ ఆధ్వర్యంలో రవీంద్ర ఉన్నతపాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పదిమంది విద్యార్థులు జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మమత అభినందించారు.

### ఆలయంలో కుంకుమార్చన

**ఎర్రవల్లి:** మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**శాంతినగర్:** వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో ఉభయరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, బీచుపల్లి, గజేందర్‌రెడ్డి, నరేష్, లక్ష్మిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదుపై సమావేశం



**కేటీదొడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ తరుపున పోటీ చేసి గెలవాలని బీజేపీ అలంపూర్ ఇన్‌చార్జ్ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడాలని, పార్టీ సభ్యత్వం అత్యధికంగా నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హన్మిరెడ్డి, శ్రీపాదరెడ్డి, సాయన్న, కృష్ణ, రాములు, భీమిరెడ్డి ఉన్నారు.

**ఎర్రవల్లి:** ప్రతి బూత్ స్థాయిలో 200లకు తగ్గకుండా సభ్యత్వ నమోదు చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యుడు అనిల్ కుమార్ అన్నారు. కోదండాపురంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, మహేష్, యాదగిరి, దేవేందర్ ఉన్నారు.